# సిస్టర్ పద్మ

రచన :
కె. శ్రీనివాస్

సిస్టర్ పద్మ ఆర్తులపాలిఀ ఆనందమూర్తి. ఆమె వార్డుడ్యూటీలోవుంటే వార్డులోంచి అంతరిస్తుంది రోగం. ఆమె దయామయవాక్కులకు, ఆమె మాతృవాత్సల్యానికి రోగులు, అధికార్లు అబ్బుర పడతారు. మేఘాల్లోదాగున్న చంద్రబింబంలా తెల్లని గౌనులో ముగ్గమురిసిపోతున్న ఆమెఅందం కళ్ళకు పండగచేస్తోంది. బుగ్గలాత్తపజే చిరునవ్వుతో, తల మీద చంద్రవంకలా అలంకరించిన ధవళవస్త్రంతో డ్యూటీకి వచ్చీరావడంతోనే తన వార్డంతా ఓమారు తిరిగివస్తూంటే దేవలోకంలోంచి దిగపడ్డ ఓదేవకన్యలావుంటుంది. సీసాలోని చేదుమందు ఔన్సు గ్లాసులోపోసి,రోగినోట్లోపోస్తే, యెంతో ఆప్యాయనంగా త్రాగుతాడు రోగి అమృతంలా. పద్మను ఓ దేవతాస్వరూపిగా గ్రహించేరు అధికార్లంతా.

ఓరోజు మామూలుగా తన వార్డులోని రోగుల సేవచేస్తోంది పద్మ. నోట చొంగలుకారుస్తూ, అలసిపోయిన దేహంతో దీనత్వం ముఖంమీద తాండవిస్తో, విచారమును సూచించేటట్టుగా కంట నీరుకారుస్తో నిలుచోంది ఆ జట్కాగుర్రం వార్డు గేటుముందర. తనడ్యూటీ పద్ధతిప్రకారం బండిదగ్గరకొచ్చి నిల్చింది పద్మ. బండిలో రోగిప్రక్క దుఃఖసముద్రంలో మునిగి తేలుతూన్న ముదుసలి అతిదీనంగా పద్మకు సలాం చేసింది. ఓ స్ట్రెచ్చరుమీద వార్డుబోయిస్ రోగిని గొనిపొయ్యారు. పాపం! శుష్కించిపోయిన శరీరంతో కంపించి పోతున్నాడురోగి. రోగికి ప్రపంచమంతా ఓ అంధకార బంధురంలావుంది. మూసిన కన్ను తెరవటంలేదు. రోగి ముక్కున ప్రాణాలున్నాయి. ఒక యింజక్షనుయిచ్చి 'జాగ్రత్త' అని పద్మను హెచ్చరించేడు సర్జను.

సిస్టర్ పద్మ రోగి తలపై ఐస్‌బేగుంచి ప్రతీ ఐదునిముషాలకోసారాయ్యాయం టెంపరేచరుచూస్తోంది. తెల్లవారింది. జ్వరతీవ్రం కాస్తతగ్గింది. రోగి చల్లగా నిద్రపొయ్యాడు. ఔన్సు గ్లాసులోని మందు రోగి నోటపోసింది. రోగి గుటకేసాడు. ఒంటిమీద చెయ్యేసి 'ఎలావుంది'అంది సిస్టర్. శుష్కించిపోయిన చేతితో దాహమని సౌజ్ఞచేసాడు. చంచాతో మంచినీరోసింది రోగి నోట. త్రాగి నిద్రపొయ్యాడు. రానురాను రోగిముఖంలో కాస్త కళ కలిగింది. రోగిప్రక్కనెప్పుడూ పరిచర్యచేస్తో పద్మ ఓ నెల గడిపింది.

ఒకనాడుమధ్యాహ్నం'సిస్టర్' అని పిలచేడు రోగి.

మంచందగ్గరకొచ్చి నిల్చింది పద్మ. 'నాపేరు పద్మ అలాపిలువండి.'

* * *

ఓ వేడి నిట్టూర్పువిడిచి తిరిగి కళ్ళు మూసుకున్నాడు రోగి—

'నేనలా పిలువలేను. సిస్టర్ అనే పిలుస్తాను.

'ఆపేరున పిలువకూడదా........?

'ఆ పేరు నాహృదయాన్ని కలచివేస్తుంది... నా అంతరాత్మ సహించలేదు'......

'.................'

'ఆనంద్ ఎల్లావుంది' అన్నాడు డాక్టరు.

'డాక్టర్ మీ దయవల్ల మునిగిపోతున్న నావ వడ్డుకుచేరుకుంది. మీ ఋణం నేను తీర్చుకోలేను. ఈ

'కథాంజలి' పాఠకులకు

శుభవార్త

●

మామూలువలె 'కథాంజలి' దీపావళిసంచిక 16–10–44 తేది వెలువడుతుంది.

●

పూర్తివివరములు వచ్చే నెల సంచికలో.

సిస్టర్ పాదాలు నారక్తంతో కడిగినా ఋణం తీరదు. కన్న తల్లికన్నా, తోబుట్టుకన్నా నన్ను అతి ప్రేమతో పరిచర్యచేస్తోంది.'

'సిస్టర్ పద్మా!'......డాక్టర్ పిలచేరు.

ఆతురత హెచ్చి నేత్రాలు విచ్చి ఆప్యాయనంగా తలెత్తేడు, రోగి.

'ఆఁ...ఆఁ...కాదు...నిజమే...సిస్టర్ పేరు పద్మ.' కంగారుగా లేవలేకపోయి తిరిగి పరుపుమీద పడిపొయ్యాడు.

'సిస్టర్! ఏమిటీ సంగతి' అన్నాడు డాక్టరు.

పద్మ హృదయంలో ఓ నూతన ఆవేదనకలిగింది. ఆమె కాళ్ళు గజగజా వణికేయి. గొంతుక బొంగురుపోతుంటే మాట్లాడలేకపోయింది. కాస్తనే పల్లా ఓ స్థంభంలా నిల్చిపోయింది......

'డాక్టర్! వీరు నాదైవం. వీరికోసం నా హృదయం, నా యౌవ్వనం, నా ఆనందం, అరికట్టి వుంచేను. మేమిద్దరం వొకరి నొకరు వదిలి ఓ నిముషమైనా వుండేవాళ్ళంకాము. (పద్మా కంటి నీటిబిందువులు రెండు నేల రాలాయి) మా యిరువురి ప్రేమకూ అడ్డు రావల్సొచ్చింది—యీయనకు దూరదేశంలో వుద్యోగంకావటం-యీడొచ్చినపిల్ల నింట్లో వుంచుకున్నాడని సంఘం యేకాద్రంగా ఘోషిస్తూంటే ఆ కారుకూతలకి లక్ష్యంచెయ్యలేదు మా మేనమామ. మా మామ తలమీద వెంద్రుకలు లేకుండా చెయ్యటానిక్కి సంఘ సంస్కర్తలంతా పూనుకున్నారు. వారి ధాటీ ముందు మా మామ ఆగలేకపొయ్యాడు. ఏదో ఓ సంబంధంచూసి పెళ్ళైందనిపించుకుందామనుకున్నాడు. కాని, నాకు బొత్తిగా యిష్టంలేని సంబంధంచెయ్యటం యిష్టంలేకపొయ్యింది. నేనీయనకువుత్తరంవ్రాస్తే అప్పట్లో నన్ను పెండ్లాడనని జవాబిచ్చేడీయన. నా ఆశ నిరాశైంది-నా ఆనందం దుఃఖంక్రింద మారింది. —నా యౌవ్వనం బూడిదలోపోసిన పన్నీరైంది. మా మామ చూసిన సంబంధం నా కిష్టంలేకపొయ్యింది. ఎల్లాఅయితేనేం నన్ను పెళ్ళికూతుర్నిచేశారు. ఆరాత్రిఇంట్లో యెవ్వరితోనూ చెప్పకుండా యీ విశాఖపట్నం చేరుకొని మీదయకు పాత్రురాలనయ్యాను. మీదయవల్ల నాకీవుద్యోగం లభించింది. ఇంత జీవనోపాయం కలిగింది. నేనిల్లా వైద్యశాలలో సిస్టర్ పనిచెయ్యడం, సంఘ నిరాదరణకూ అసహ్యతకూ గురయ్యాను. సంఘ సంస్కర్తలు నాకు బహిష్కార పత్రికలంపేరు. సంఘం కంటిలో నేనొక నలుసులా మెరసిపొయ్యాను. నా జీవితానందం యీ రోగుల సేవలక్రింద ధారపోసి రోజు లానందంగా గడుపుతూంటే యీయన కిలావచ్చింది'అంటూ కంట భాష్పాలు రాల్చి......ఆనంద్ ప్రక్కకు తిరిగింది...

ఆనంద్ పశ్చాత్తాపం వెలిబుచ్చేటట్టు క్షమాపణ వేడుకుందికిగాను పద్మ రెండుచేతులూ పట్టుకొని, 'నేను కసాయిని. పద్మను నమ్మించి తల వెంద్రుకతో గొంతుకోసాను. మా అమ్మ చేతుల్లో ఓ కీలుబొమ్మ నయ్యాను. ఆమెకట్నం ఆశ యీ పద్మను నిరాకరించింది. నే నాఫీసులోవుండగా పద్మ వివాహపత్రిక అందింది. నా వంటిమీద వేయి జెర్రెలు ప్రాకినట్లైయింది. పద్మకు ధారపోయపడ్డ నా జీవితం మంటకలసింది. చేతి కందినపండు నేలజారి చితికిపోయింది. ఆ సంబంధం నిరాకరించిందనీ, యిల్లా సిస్టర్ వుద్యోగంచేస్తోందనీ, నాకు తెలియలేదు. అది మొదలిల్లా మనోవ్యాధితో కృశించిపోయ్యాను. యీ దుఃఖమయలోకంలో కాకపోయినా వచ్చేజన్మలోనైనా పద్మను కలుసుకుందామనుకున్నా. కాని మీరిచ్చిన మందుకూ, యీమెచేసిన సేవకూ నాజీవితం నిలిచింది. ఈ నా జీవితంలో ఓ నూతన జ్యోతి ప్రకాసిస్తోంది-పద్మా! క్షమించవూ!' అంటూంటే—

పద్మ ఆనంద్ పాదాలపై వ్రాలింది. పద్మ యిక గౌనువేసుకోడం మానేసింది—ఆసుపత్రి అసలే మరచిపోయింది-ముఖాన్ని తిలుకంధరించింది. ఇల్లా ఓ తొమ్మిదినెల్లు గడిచేయి—తిరిగి డాక్టరుగారిని పలుకరించటానికి, పద్మా, ఆనందు లిరువురూ వైద్యశాలకొచ్చేరు—రెండోరోజు సాయంకాలం ఆరుగంటలకు 'క్యావు! క్యావు! మని చంటి పాపేడుస్తూంటే, డాక్టరు' ఆనంద్! పిల్లాడు...టీపార్టీ— అన్నాడు......